# వరాన్వేషణ

ఇవాళ పార్వతి దగ్గరనించి ఉత్తరం వచ్చింది. పార్వతిదగ్గరనించి ఉత్తరం వచ్చినప్పుడల్లా తన్ను పశ్చాత్తాపం దహించవలసిందే కదా ! ఒక్క క్షణమైనా పార్వతి తన్ను మరిచినట్లుండలేదు. దాని ఉత్తరాలు అంత హృదయపూర్వకంగా—ఆర్తిగా—ఉంటై. తను ? మళ్ళా పార్వతి ఉత్తరం రాసేదాకా పార్వతి జ్ఞాపకమే రాదు. అదేం ఖర్మమో !

"ప్రియురాలా, నువ్వే—నిన్ను పెళ్ళికూతురుగా చూడాలన్న ఉత్సాహం నాకు నానాటికీ జాస్తి అవుతున్నది....నీ కున్న దుస్తుల్లో మంచివి నాలుగు వెంట తీసుకుని వెంటనే బయలుదేరి వస్తావా ?........మా సాగర్ కూడా నిన్ను చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాడు— నీ ప్రియురాలు, పా."

సాగర్ సంగతి తమ పార్వతినోట చాలా విన్నది. అంతకంటె చక్కని వాడూ, నాగరికుడూ ఉండడనేది పార్వతి. తనకూ సాగర్‌కూ ముడి పెట్టాలని చూడటం లేదుకద తన "ప్రియురాలు". ఆ ఆలోచన కలిగితేనే గుండె దడదడా కొట్టుకుంటున్నది. నిజంగా తనకు అంత అదృష్టమా ? తనకు సంబంధించినంత వరకు అదృష్టమనేది—వివాహ విషయంలోనే కాదు—ఏ విషయంలో కూడా లేనే లేదని తను నిరాశ చేసుకోలేదా ? ఇంత నిరాశా నిస్పృహవెంట మళ్ళీ ఈ ఆశాంకుర మేమిటి ?

తన ఏడో ఏట భర్త పోయినప్పుడు కొందరు సాహసులు, "పాపం ! ఇంత చిన్నతనంలో వైధవ్యం !....ఇంకా పెళ్ళియీడన్నా రాలేదు. మళ్ళా పెళ్ళి చేసెయ్యవచ్చును ...ఇప్పుడంతా చేస్తూనే ఉన్నారు. అంటే తనకు భయం వేసేది. తను మళ్ళా పెళ్ళి చేసుకుంటే పెళ్ళిపీటలమీదనే తన్ను యమధర్మరాజు పీక పిసికేస్తాడని ! ఆ తరువాత స్కూలులో పెద తరగతులు చదివేరోజుల్లో పెళ్ళిమీద ఆశ వెళ్ళింది. పునర్వివాహమంటే జంకు పోయింది. కాని కాలేజీలో ప్రవేశించి పార్వతితో సాహసం మొదలు పెట్టిన తరవాత పెళ్ళంటే తనకు అసహ్యం పుట్టింది. పెళ్ళి ప్రతిబంధకమనీ, పెళ్ళి లేకుండా ఉంటే ఏవో పెద్దపెద్ద ఆశయాలు సార్థకపరుచుకోవచ్చుననీ, పార్వతి చెప్పేది. ఘోరమైన అవినీతిని కూడా సమర్థించేది పార్వతి—చాటుగా, ఎవరూ విననప్పుడు. పార్వతికి చాలా అనుభవం అయిందని కూడా తను ఒకప్పుడు విశ్వసించింది ! బి. ఏ. క్లాసులో ప్రవేశించిన తరవాత తనూ

పార్వతీ ఏకగ్రీవంగా పెళ్ళిని గురించి తమ అభిప్రాయాలు మార్చుకోగలిగారు. అయితే ఎటువంటి భర్తను పెళ్ళాడాలి ? తాము పెళ్ళాడే భర్త ఎంత ఆదర్శ భర్త అయినా తమ ఇద్దరికీ తృప్తి కలిగేది కాదు. తమకు కావలసిన దేవుళ్ళవంటి భర్తలు ఎక్కడన్నా ఉన్నారా అని కూడా తమకు అనుమానం కలిగేది. ఉంటేనే పెళ్ళాడు దామనీ లేకపోతే మానుదామనీ కూడా అనుకున్నారు. ఒకసారి లైబ్రరీలో పుస్తకాల కోసం వెతుకుతుంటే ఒక పుస్తకంమీద **Men Like Gods** అని కనిపించింది. పార్వతి మెరుస్తున్న కళ్ళతో తన వంక చూసింది. తను అర్థం చేసుకుంది ....

ఆ రోజు లేమయినవో ! తన ఆదర్శాలు ఎట్లా ఆకాశ పథంనించి కిందికి దిగి రాసాగినై ! ఎంత సామాన్య పురుషులు కూడా తన కళ్ళకు ఎంత వాంఛనీయు లుగా కనపడ్డారు ! ఆ సామాన్య పురుషులు కూడా తన్ను పెళ్ళాడరన్న అనుమానం తన్ను ఏ విధంగా అవతరించింది ! అనుకోటానికి కొంచెం హాస్యాస్పదంగా ఉంటుంది కాని భద్రం తన్నిప్పుడు—కనీసం పార్వతి ఉత్తరం రాకమునుపు—పెళ్ళాడతానంటే తను ఎగిరి గంతువేసి ఉండదా ! అదృష్టవశాత్తూ—పార్వతి ధర్మమా అని—దేవుడు మేలుచేస్తే—తనకిప్పుడు భద్రాన్ని పెళ్ళాడవలసిన అగత్యం తప్పింది.

భద్రం—పార్వతి అన్న—మంచివాడు కాడనికాదు. చాలా మంచివాడుం ఏడిపించటానికీ ఎక్కి తొక్కటానికీ భద్రం తరవాతనే ఎవరైనా. కాని పెళ్ళాడ టానికి—ఓహ్ ! నూటతొంభై ఎనిమిది పౌనులు—ఇంకా వృద్ధిలోనే ఉంది ! ఇప్పట్లో ఈ పెంపు ఆపుదల అయే లక్షణాలేవీ లేవు ! అదికాక భద్రానికి—ఏమనాలి ?—స్త్రీతో నిమిత్తం ఉన్నట్టు కనపడదు ! భద్రం ఉన్నచోట—వాని పేరేమిటి ?—ఉద్రేకం లేదు.

తను వివాహానికి అర్హురాలు కాదేమో అన్న సంశయం కూడా తనకు కలగటం ప్రారంభించింది. అంతకన్న కూడా ఎక్కువగా తన్ను బాధిస్తున్నది, తన తండ్రి తన మూలంగా పడుతున్న బాధ. సగౌరవంగా తనకు పెళ్ళి చెయ్య టానికి ఆయన కభ్యంతరంలేదు. కాని తన మూలకంగా నిరాధారమైన అపవాదు కావటం—తన మూలకంగా ఇంటికి వయసులో ఉన్న వాడెవడూ రావటానికి వీలులేకపోవటం—ఆయనకు చాలా కష్టంగా ఉంది. ఎవరినో ఒకర్ని చేసుకోవ టానికి తనకు అభ్యంతరం లేకపోయినా, ఆయన కభ్యంతరం ఉంది. "ఏదో ముడి పెట్టేశారు, లేకపోతే ఆ సుశీలకు మంచి సంబంధం ఎట్లా తేగలడు తండ్రి ?" అని ఎవరన్నా అని పోతారని ఆయనకు చెడ్డ భయం. అందుకని తన పెళ్ళి విషయమై ఆయన్ను బాధపడనివ్వటం తన కిష్టంలేదు. అది తను చూసుకోవలసిందే —అనగా, పార్వతి చూడవలసిందే ! పాపం, పార్వతి !

* * * *

ఈ సాగర్ ఎంత అందంగా ఉంటాడూ ! ఏమి నాజూకు ! ఏమి నాగరికత ! తను ఆ మాత్రం మనిషిని ఎన్నడూ చూసినట్టులేదు. నిజంగా సాగర్ తన్ను పెళ్ళి చేసుకుంటాడా ? అతను బుద్ధి తెలిసినప్పటినించీ బొంబాయిలో పెరిగినవాడు—అతన్ని ఆకర్షించేటందుకు తనలో ఏముందీ ? చక్కదనం—భగవంతుడిచ్చిన సౌందర్యం—తనలో కొంత ఉండవచ్చు. కాని నిజమైన నాజూకు తనకేం తెలుసు? బొంబాయిలో సాగర్ తన లాంటి పిల్లలను ఎంతమందిని చూసి ఉండాలి ! ఎంతమందితో పరిచయం ఉండి ఉండాలి !

జీవశక్తి మూర్తీభవించినట్లున్నాడు సాగర్. అతను ఒక్క క్షణం నిశ్చలంగా ఉండడు. ఎప్పుడూ నవ్వుతూ, మాట్లాడుతూ, గబగబా అటూ ఇటూ పైకీ కిందికీ తిరుగుతూ ఉంటాడు. పార్వతి తన్ను పరిచయం చెయ్యగానే, ఎంతో ఆప్తుడల్లే తన చెయ్యి పట్టుకుని, తన్ను "సుస్" అని సంబోధించి, తన్ను చూడటం తనకు పరమానందంగా ఉందన్నాడు అవి కేవలమూ అతని నాగరికతే కావచ్చును—కాని చూడటానికి ఎంతో ఇంపుగానూ తృప్తిగానూ ఉంది....

ఈ సాగర్ తన్ను ప్రేమిస్తాడా? ఎందుకు తనకు వెర్రి ఆశ. ఆశ పడకుండా తను ఎందుకు ఉండలేకుండా ఉందీ ? భద్రాన్ని కూడా—మాటవరసకే కానీ !—పెళ్ళాడటానికి సంసిద్ధురాలై ఉన్న తనకు సాగర్‌మీద ఆశ ఏమిటీ ? ఏమిటి ఈ మానవ మనస్తత్వం !.......

* * * *

పాపం, పార్వతి తన చేతనైనంత చేస్తున్నది. ఇప్పటికి మూడు గంటల నుంచీ తనూ సాగర్ ఒంటరిగానే ఉన్నారు. ఇద్దరూ పేకాడారు, చదరంగం ఆడారు. తను పాడితే అతను హార్మోనియం వాయించాడు, అతను వాయించుకుంటూ పాడాడు.

ప్రతి విషయానికి తన్ను సాగర్ అభినందిస్తూనే ఉన్నాడు. అది హృదయపూర్వకంగా మెచ్చుకోవటమో కృత్రిమమైన మర్యాదో చచ్చినా తనకు తేలటం లేదు....

ఆఖరుకు తన సౌందర్యాన్ని కూడా స్తోత్రం చెయ్యటం మొదలు పెట్టాడు సాగర్. అతని నోటివెంట వచ్చే ఆ స్తోత్రం ఎంత సహజంగా, నిష్కపటంగా, విశ్వసనీయంగా ఉందీ ! అతను తప్పకుండా తన్ను ప్రేమిస్తున్నాడు. సందేహం లేదు. తనకు కలలో కూడా తలవని అదృష్టం పట్టబోతున్నది. ఈ సాగర్ తన్ను పెళ్ళి చేసుకుని తన జీవితాంతం వరకూ ఇట్లా చూస్తే తనకంటె అదృష్టవంతురాలుండబోతుందా ?....

"సుస్సీ. నీలో ఉన్న విశేషం ఎవరైనా చెప్పారా ? అది ఉత్త కనిముక్కు తీరుకాదు—కేవలమూ మంచి 'ప్రపోర్షన్' మాత్రమేకాదు. నీలో ఉన్న విశేషం ఏమిటంటే నీ ప్రతి కదలికలోనూ ఉన్న 'ఆర్టిస్టిక్ బాలెన్స్'. అది నేనెన్నడూ చూడలేదు—నీలో చూసినంత పరిపూర్ణంగా !....నీవు ఏ ఆర్టిస్టు దగ్గిరయినా మోడల్‌గా ఉండటానికి ఒప్పుకుంటే దోచేస్తావు, సుస్సీ !"

ఇదీ సాగర్ పోకడ !....అతను అన్నిరకాలా అంత సేపటినించీ ప్రశంసిస్తూ ఉంటే తనకు నోటమాట రాదేం ? అతను తన్ను గురించి ఎంత అంటున్నాడో తనకూ అతన్ని గురించి అంతకంటె ఎక్కువ అనాలనే ఉంది. కాని నాలుక మడత బడి పోతున్నది. ప్రయత్నం చెయ్యబోతే....సామాన్యంగా ఒకర్ని ఎదురుగా పట్టుకుని ఎడ తెరిపి లేకుండా పొగడటం చాలా కష్టం; సాగర్ అటువంటి పని ఎట్లా చెయ్యగలుగుతున్నాడో ?....ఇదంతా కలా, నిజమా ? ఇది కలే అయితే బాగుండు ననిపిస్తున్నదేమిటి ? అతను మాట్లాడుతున్నకొద్దీ తనకు ఊపిరాడనట్టవు తున్నది ! అతని మెప్పు తనకు మొహం మొత్తుతున్నదా ?—too much of a good thing అయిందా ?........

* * * *

అయిదు గంటలకు భద్రం ఆఫీసునించి వచ్చేశాడు. భద్రాన్ని చూడగానే తన ప్రాణం ఎట్లా లేచి వచ్చింది ! పాపం, భద్రాన్ని చూసి ఆరు నెల్లయింది.

ఈ ఆరునెలల్లోనూ ఆరు పౌనులు పెరిగాననన్నాడు భద్రం. తను ఆపుకో లేకుండా నవ్వింది. లాఫింగ్ గాస్ పుచ్చుకున్న దానల్లే నవ్వింది. తను అతిగా నవ్వుతున్న సంగతి తనకు తెలుసును. కాని ఆ నవ్వు ఆపుకోలేకపోయింది. నవ్వ తీరవలసి వచ్చింది. మనసారా నవ్వి ఎంతో కాలమైనట్టు కూడా ఉంది తనకు.... ఏ చంద్రమండలంలోకో వెళ్ళి తిరిగి భూమిమీదికి వచ్చినట్టుంది.

తను సుఖంగా ఊపిరిపీల్చి కూడా ఎంతో కాలమైనట్టుంది!....

సాగర్‌తో సహజంగా మాట్లాడటానికి గాని, చివరకు అతనివంక చూడ టానికి గాని తనకు దాదాపు అసంభవంగా ఉందేమిటి?....పార్వతికాని భద్రంకాని తన అవస్థ గమనిస్తారేమో !

* * * *

రాత్రి భోజనాలు కాగానే భద్రం వెన్నెల షికారు ప్రోగ్రాం పెట్టాడు కొండలవేపు. భద్రం తన కారులో నలుగుర్నీ కొండల దగ్గిరికి చేరవేశాడు.

వెన్నెల పిండి ఆరబోసినట్లున్నది. రాళ్ళ గుట్టలు ఆ వెన్నెల్లో తడు స్తున్నై. చెట్లూ పొదలూ వెన్నెల ఓడుతున్నై.

పార్వతీ సాగర్లు గబగబా గుట్టలెక్కి పోయినారు. భద్రం కోసం తను వెనక్కు తగ్గుతూ ఆ ఇద్దరి జాడా పోగొట్టుకున్నది....భద్రం తన పక్కన ఉండక పోతే తనకు జబ్బు చేసేట్టున్నది.

భద్రం ఒక బండమీద చతికిలపడి రొప్పుతూ ఒక అడుగన్నా వెయ్య నన్నాడు. తను కూడా అతని పక్కనే చతికిల బడ్డది, అతని రొప్పుకు నవ్వుతూ.

"ఈ వెన్నెల—" అన్నాడు భద్రం, అంతకంటె ఎక్కువ మాట్లాడటానికి శక్తి లేకుండా. "ఎంత బాగుందీ....!" అన్నాడు మళ్ళీ ఒక తీవ్రమైన ప్రయత్నంతో.

"సుస్సీ, కిందటిసారి—నిన్ను చూసినప్పటికన్న—ఎంత ఓహ్—"

"ఏమిటి, భద్రం?"

"ఎంత అందంగా ఉన్నావ్!"

"నేనా?.... అందంగా ఉన్నానంటావా?....ఆ విషయం నీకు తెలిసిందంతా ఓపిక ఉన్నంతవరకు చెప్పు. నాకు వినాలని సరదాగా ఉంది—నీ నోటివెంట!"

"ఎగతాళి కాదు, సుస్సీ!—నేను నిన్నెప్పుడైనా నన్ను పెళ్ళాడుతావా అని అడిగానా?"

"లేదు"

"తమాషాకైనా!"

"ఉఁహుఁ!"

"అయితే సుస్సీ, నన్ను పెళ్ళాడుతావా? ఈ వెన్నెల—ఈ వెన్నెట్లో నిన్ను చూసి, నిన్ను పెళ్ళిచేసుకోకపోతే నేను—నా అంత శుద్ధ మూర్ఖుడు లేడన్న మాటే!"

"నన్ను పెళ్ళాడుతా నంటున్నావా?"

"అవును."

"రేపు పట్టపగలు నన్ను చూసేదాకా ఆగరాదూ? రేపు మళ్ళీ పశ్చాత్తాప పడతావేమో!"

"కాదు, సుస్సీ! ఇప్పుడే!—"

"ఇప్పుడే పెళ్ళాడేస్తావా ఏమిటి కొంపదీసి!"

"ఇప్పుడే అడుగుతాను."

"నేను ఒప్పుకుంటాను సుమా!"

భద్రం నన్ను దగ్గిరికి లాక్కుని కొండలన్నీ[1] మారుమోగేట్టు ముద్దు పెట్టుకున్నాడు. సశబ్దస్తుములోన్ భవత్....

నలుగురూ ఇంటికి చేరేటప్పటికి పన్నెండయింది. పన్నెండున్నరకు పార్వతి తన గదిలోకి వచ్చి తన పక్కమీద కూర్చుని, "ఏమే సుప్పా? భద్రం ఏమైనా కదలబారాడా?" అన్నది.

"నీకెట్లా అనుమానం తట్టిందే, పార్వతీ? భద్రానికి ఆ ఆవేశం అకస్మాత్తుగా కలిగింది. నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు!" అన్నది తను ఆశ్చర్యంతో.

"ఎవరా అన్నది!....భద్రం నన్ను ఎంత కాలంనించో చంపుతున్నాడు. నిన్ను ఇందుకే పిలిపించమని. నేను నిన్ను రమ్మన్నదీ ఇందుకే!....వాడికీ ఆలోచన బాగా రెండు సంవత్సరాలనించీ ఉన్నట్టు కనిపిస్తుంది. నాతో చెప్పటానికే సిగ్గుపడ్డాడు, నీతో ఎట్లా అనగలిగాడో నేను ఊహించలేకుండా ఉన్నాను....వెన్నెలే అయి ఉంటుంది!"

"ఉత్త వెన్నెల కూడా కాదు—రొప్పు!"

పార్వతి అర్థంకాని దానల్లే తనవంక కాస్సేపు చూసి విషయం మార్చింది.

"సాగర్ నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. నువు సాగర్‌ను బాగా ఎరగవు. నేను చేసుకోను పొమ్మన్నాను! వాడు చాలా కష్టమైన మనిషి!...."

తన్ను పార్వతి భద్రాన్ని పెళ్ళాడటానికి రమ్మన్నదని తెలిసినప్పుడు తనకు పార్వతిమీద కలిగిన కించిత్తు కోపమూ పార్వతి ఆఖరుకు అన్న ముక్కతో గాని ఉపశమించలేదు....

---

1. పెద్ద శబ్దం ఏర్పడింది అని అర్థం.

ముద్రణ: ఆగస్టు 1937, స్వాగతం కథల సంపుటి, యువ కార్యాలయం, తెనాలి.